
ప్రజాశక్తి
మంగళవారం 26 మార్చి 2024



27న జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2023- 24 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హైదరాబాదులో గల ఎంఎస్ఎన్ లేబొరేటరీ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గానూ ఈనెల 27న స్థానిక వాసవీ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. అభ్యర్థులు 20 ఏళ్లలోపు వారై ఉండాలని, నెలకు రూ.11వేలు వేతనం ఇవ్వబడుతుందని, అభ్యర్థులకు సబ్సిడీ క్యాంటీన్ సదుపాయం, రెండేళ్లు సబ్సిడీ హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. అలాగే ఉచిత రవాణా సౌకర్యం కూడా ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులను కంపెనీ నిధులతో ప్రముఖ యూనివర్సిటీలో మూడేళ్లు డిగ్రీ చదివించడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 6303204295, 9182063878 సెల్ నెంబర్లకు సంప్రదించాలని యాజమాన్యం కోరింది.

కౌన్ బనేగా కేండిడేట్

- ఎమ్‌పి అభ్యర్థి కోసం వెతుకులాట
- యు టర్న్ తీసుకున్న బిజెపి
- టిడిపిలో మారిన రాజకీయ సమీకరణాలు



అశోక్ | కళావెంకటరావు | కిమిడి నాగార్జున | తెంటు లక్ష్మునాయుడు


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి బిజెపి అనూహ్యంగా తప్పుకోవడంతో టిడిపిలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. దీంతో అధిష్టానం అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభిస్తోంది. ఎన్నికల పొత్తులో భాగంగా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపి కోరడం, అందుకు టిడిపి అధిష్టానం కూడా సానుకూలంగా స్పందించడం విదితమే. దీంతో, విజయనగరం ఎమ్‌పి అభ్యర్థి కోసం టిడిపి అధిష్టానం నిన్నటి వరకు ఆలోచించలేదు. బిజెపి అభ్యర్థిగా ఎవరు వస్తారా? అని జనంలో ఆసక్తికర చర్చ నడిచింది. పున:పరిశీలనలో భాగంగా బిజెపి అగ్రనాయత్వం విజయనగరానికి బదులు రాజంపేట లోక్‌సభ టికెట్‌ను తీసుకుంది. దీంతో తిరిగి టిడిపి తమ అభ్యర్థిని చూసుకోవాల్సి రావడంతో అధినాయకత్వం గెలుపు గుర్రాన్ని అన్వేషిస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పేర్లు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం.

ఈ ఎన్నికలు టిడిపికి చావోరేవో అన్నట్టుగా ఉండడం, లోక్‌సభ అభ్యర్థిని బట్టే అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలం, బలహీనత ఉండే పరిస్థితులను భేరీజు వేస్తూ అధిష్టానం ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న పేర్లకు ప్రత్యామ్నాయానికి కూడా పరిశీలిస్తోందట. పొత్తులో భాగంగా జనసేన, బిజెపికి కొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు తగ్గుతాయని భావించిన టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ఆశావహులను వెనక్కి తగ్గించింది. ఇలాంటి పరిస్థితుల్లో విజయనగరం అసెంబ్లీ స్థానం తన కుమార్తె అదితి గజపతిరాజుకు కేటాయించాలంటూ అశోక్ పార్టీని కోరారు. ఈ ప్రతిపాదనను చంద్రబాబు సున్నితంగా తిరస్కరిస్తూ 'మీరే పోటీలో ఉండాలి' అంటూ అశోక్‌కు సూచించారట. చివరికి అశోక్ తన కుమార్తె కోసం పట్టుబట్టారని, దీంతో బాబు కూడా అశోక్‌ను పక్కనబెట్టి అదితికి సీటు ఖరారు చేశారని విశ్వస నీయ సమాచారం. ఈ నేపథ్యంలో అశోక్ తిరిగి తన కోసం ఎమ్‌పి టికెట్ అడిగే పరిస్థితి లేకపోవడంతో, ఇదే అదునుగా బాబు కూడా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపికి హామీ ఇచ్చారట. దీంతో పార్టీ ఎమ్‌పి అభ్యర్థి కోసం ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది. బిజెపి తరపు ఆశావహుల్లో విజయనగరం కన్నా ఇతర స్థానాల్లో ఉన్నవారికి ప్రాధాన్యతనిచ్చింది. దీంతో, నిన్నగాక మొన్న బిజెపి విడుదల చేసిన జాబితాలో విజయనగరం లోక్‌సభను మినహాయించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో టిడిపి తరపు అభ్యర్థిని బరిలోకి దింపుకునేందుకు అవకాశం కలిగింది. ఇప్పటికే విజయనగరం, మన్యం జిల్లాల్లో చీపురుపల్లి, పాలకొండ అసెంబ్లీ అభ్యర్థులను తేల్చలేక తటపటాయిస్తున్న టిడిపికి ఎమ్‌పి అభ్యర్థిని కూడా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు అశోక్ తనకు తానుగా సీటు కోసం ప్రస్తావించే పరిస్థితి లేదు. అలాగని పిలిచి సీటిద్దామనుకుంటే సామాజికవర్గ విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో ఎచ్చెర్ల అసెంబ్లీ సీటు ఆశిస్తున్న మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు లోక్‌సభకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదట. ఇక చీపురుపల్లిని పదేళ్లుగా అంటిపెట్టుకుని ఉన్న కిమిడి నాగార్జున కూడా ఎమ్‌పిగా పోటీకి ససేమీరా అంటున్నారట. చాలా కాలంగా చట్టసభలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పేరును బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన సూచిస్తున్నట్టు సమాచారం. వీరిలో ఎవరో ఒకరిని లోక్‌సభ అభ్యర్థిగా పంపే అవకాశం ఉంది. పార్టీ నిర్ణయానికి వారు కట్టుబడి ఉంటారా? లేక ప్రత్యామ్నాయం పరిశీలిస్తారా? అనేది టిడిపిలో జరుగుతున్న చర్చ. ఈ చిక్కుముడి వీడాలంటే మరో రెండు మూడు రోజులు నిరీక్షించాల్సిందేనని పరిశీలకులు చెబుతున్నారు.

ఎంపిలకు పట్టని పాలకొండ

నియోజకవర్గ అభివృద్ధికి చేసింది సున్నే...



ప్రజాశక్తి -పాలకొండ

అరకు పార్లమెంటు ఎమ్‌పిగా ఇప్పటి వరకూ ఎన్నికైన వారంత తమ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. ఎంపిగా గెలిచిన తర్వాత వారు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూసిన పాపం లేదు. ఓట్లు వేసిన వారు కూడా తమ ఎంపి ఎలా ఉంటారో మర్చిపోయిన పరిస్థితి కనిపిస్తుంది. 2009లో రాజకీయ ఉద్దాండుడుగా పేరు తెచ్చుకొని కిషోర్ చంద్రదేవ్ కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా కూడా పని చేశారు. అయినప్పటికీ నియోజకవర్గానికి ఒరిగేదేమీ లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే 2014లో వైసిపి తరపున కొత్తపల్లి గీత గెలిచినప్పటికీ ఆమె నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాల్లేవు. అంతేకాకుండా అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి పార్టీలో చేరి, అక్కడ కూడా ఇమ్మడ లేకుండా జన జాగృతి అనే సొంత పార్టీ పెట్టుకుని ఇక్కడ రాజకీయ చర్చకు తెరలేపారని చెప్పవచ్చు. అనంతరం 2019లో అధికార పార్టీకి చెందిన వైసిపి అభ్యర్థి గొడ్డేటి మాధవి ఎన్నికయ్యారు. ఆమె భారీ మెజారిటీతో గెలిచినప్పటికీ నియోజకవర్గ ప్రజలు ఆమెను గుర్తించలేని పరిస్థితి కనిపిస్తుంది. పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లో ఎటువంటి కార్యక్రమాలకు కూడా పెద్దగా ఆమె హాజరు కాలేదని సొంత పార్టీలోనే చర్చ జరుగుతోంది.

సమావేశాలకి డుమ్మా

అరకు ఎంపిలుగా గెలిచిన వారు ప్రజా సమస్యలు చర్చించాల్సిన ఎటువంటి సమావేశాలకు కూడా హాజరు కావడంలేదు. సీతంపేట ఐటిడిఎ సర్వసభ్య సమావేశంతో పాటు జిల్లా పరిషత్ సమావేశాలకు కూడా ఎక్కడా హాజరైన దాఖలాల్లేవు. కిషోర్ చంద్ర దేవ్ కేంద్ర మంత్రి హోదాలో రెండు సార్లు జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరయ్యారు. అలాగే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో ప్రస్తుతం ఎంపి మౌనం దలిచారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నోటాకే మోజు

2019 ఎన్నికల్లో అరకు ఎంపీ స్థానంలో నోటా ఓట్లే అత్యధికంగా కనిపించాయి. 47,977ఓట్లుతో మూడో స్థానం దక్కించుకుంది. అంటే ఎక్కువ మంది బరిలో ఉన్న వారికి ఓట్లు వేయడానికి ఓటరు అయిష్టత చూపారని తేటతెల్లం అవుతుంది. ఈసారి ఎంపిగా గెలిచినవారు పాలకొండ నియోజకవర్గానికి ఎంతవరకు అందుబాటులో ఉంటారో, ఏ మేరకు అభివృద్ధి చేస్తారో వేచి చూడాల్సి ఉంది. అదే విధంగా అరకు పార్లమెంటు ప్రజల గొంతు ఢిల్లీ వీధుల్లో ఎంతవరకు వినిపిస్తారో కూడా చూడాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

ప్రజల మధ్య చిచ్చు పెట్టే పార్టీలను ఓడించాలి

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - సాలూరు

ప్రజల మధ్య చిచ్చు పెట్టే పార్టీలను ఓడించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు సృష్టించి పబ్బంగడుపుకుంటున్న బిజెపిని మళ్లీ గెలిపిస్తే దేశానికి తీరని నష్టమని అన్నారు. మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిన మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రానికి చెందిన టిడిపి, జనసేన, వైసిపి నాయకులు ఒక్క మాట విమర్శించకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర విభజన నుంచి నేటి వరకు మోడీ ప్రభుత్వం ఎపికి తీవ్రమైన ద్రోహం చేసిందని విమర్శించారు. అయినా ఈ మూడు పార్టీలు బిజెపితో అంటకాగుతున్నాయని, దీన్ని ప్రజలు ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేయలేదని చెప్పారు. సంక్షేమ పథకాలతో జనాలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని కలలు కంటుందని చెప్పారు. బిజెపి ప్రభుత్వం పరిశ్రమల మూత, ప్రయివేటీకరణ విధానాలను వైసిపి, టిడిపి, జనసేన సమర్థించాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోలేదని చెప్పారు. గత ఎన్నికల ముందు ఉద్యోగులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఇలాంటి పార్టీలను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కృష్ణమూర్తి కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు, సాలూరు, పాచిపెంట మండలాల కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, మక్కువ మండల నాయకులు టి.ప్రభాకర్, పట్టణ నాయకులు టి.వెంకటరావు, టి.శంకరరావు పాల్గొన్నారు.

రంగులు, కేరింతలతో హోలీ సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

హోలీని పురస్కరించుకొని పట్టణంలోని పలు వార్డుల్లో చిన్నారులు, యువకులు, మహిళలు రంగులు జల్లుకుంటూ, పలు రంగులు కలిపిన నీళ్లు జల్లుకుంటూ కేరింతల నడుమ సోమవారం హోలీ సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా రాజస్థాన్‌కు చెందిన మార్వాడీలు పలు వ్యాపారాల నిమిత్తం పట్టణంలో నివాసం ఉంటున్నారు. వీరుంటున్న వీధుల్లో ఈ హోలీ సంబరాలు మరింత ఎక్కువగా జరుపుకోవడం విశేషం.

వీరఘట్టం : మండల కేంద్రంతో పాటు చిట్టిపూడి వలస తదితర గ్రామాల్లో సోమవారం హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత రంగులు జల్లుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండలంలోని గరుగుబిల్లి, కొంకిడివరం, రావుపల్లి, ఉల్లిభద్ర, రావివలస, తోటపల్లి, పెద్దూరు, తదితర గ్రామాల్లో హెూలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

కురుపాం : హోలీ పండగను పురస్కరించుకొని కురుపాంలో గల శివన్నపేట, న్యూ కాలనీ, శోభలతా దేవి కాలనీ తదితర వీధుల్లో పిల్లలు, పెద్దలు, యువత రంగులు పూసుకొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పెద్దలు హెూలీ పండుగ ఆవశ్యకతను వివరించారు. ఈ పండగలో పెద్దలు, మహిళలు, యువత, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిట్టిపూడి వలసలో పాఠశాల విద్యార్థులు వుంఖాలకు రంగులు పూసుకుని ఘనంగా హెూలీ పండుగ జరిపారు.

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.



పార్వతీపురంలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న యువత

తేలని టికెట్ పంచాయితీ

జనసేన తరపున ఐవీఆర్ సర్వే

ప్రజాశక్తి-పాలకొండ

నియోజకవర్గంలో టిడిపి తరపున టికెట్ విషయంలో నేటికీ స్పష్టత రాలేదు. మొదటి నుంచి టికెట్ ఆశిస్తున్న టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మక జయకృష్ణకు టికెట్ విషయంలో స్పష్టత రానట్టు తెలుస్తుంది. మొదటి నుండి జయకృష్ణకు వ్యతిరేకంగానే నియోజకవర్గ పరిధిలో కొందరు నేతలున్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు సామంతుల దామోదరరావు, మాజీ ఎంపిపి ప్రతినిధి వారాడ సుమంత్ నాయుడు, మాజీ జడ్పీటీసీ ప్రతినిధి ఖండాపు వెంకటరమణతో పాటు మరికొందరు నేతలు బహిరంగంగానే వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే మూడు నెలల క్రితం అమరావతిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జయకష్ణతో పాటు పాలకొండ నియోజకవర్గంలో ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి గ్రూపుల్లేకుండా పని చేయాలని, నాయకులందర్ని కలుపుకుని పోవాలని జయకృష్ణకు సూచించినప్పటికీ ఆ దిశగా ఆయన సఫలీకృతం కాలేకపోతున్నారు. దీంతో పార్టీలో గ్రూపుల గోల ఎక్కువవ్వడంతో అభ్యర్థి ఎంపిక పార్టీ అధినేతకు తలనొప్పిగా మారినట్టు తెలుస్తుంది. పొత్తుల్లో భాగంగా పాలకొండ సీటు జనసేనకు కేటాయించినట్టు తెలుస్తుంది. అయితే ప్రస్తుతం జనసేనలో ఉన్న నాయకులెవరూ పోటీకి ముందుకు రాకపోవడంతో టిడిపిలో ఉన్న అశావాహుల్లో ఒకరిని ఎంపిక చేసుకోవాలని ఇరు పార్టీల నేతలు కూడా భావిస్తున్నట్టు సమాచారం. మొన్నటి వరకు తెలుగుదేశంలో ప్రచారం చేసిన తేజోవతి జనసేనలో చేరి టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ కూడా పొత్తుల్లో భాగంగా జనసేన తరపున ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అయితే టిడిపిలో జయకృష్ణ వ్యతిరేక గ్రూపునకు చెందిన పడాల భూదేవి కూడా టికెట్ వస్తుందన్న ఆశగా చూస్తున్నారు. గత రెండు రోజులుగా జనసేన తరపున నియోజకవర్గనికి సంబంధించి ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో పడాల భూదేవి పేరు ఒక్కటే సూచించడం కూడా భూదేవినే జనసేన అభ్యర్థి అని చర్చ జరుగుతోంది. అలాగే భూదేవికి మద్దతుగా ఉన్న నియోజకవర్గ నేతలు అమరావతిలో మకాం వేయడంతో నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఏది ఏమైనా ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి విషయంలో స్పష్టత రాకపోవడంతో కేడర్‌లో అయోమయం నెలకొంది.



జయకృష్ణ | పడాల భూదేవి

నేటి నుంచి మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు

ప్రజాశక్తి - పార్వతీపురం

వికలాంగ విద్యార్థుల వైకల్యం నిర్ధారణ నిమిత్తం జిల్లాలో మంగళవారం జిల్లాలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి 18ఏళ్ల వయసు గల వికలాంగులై చదువుకునే విద్యార్థులు వైకల్యత్వాన్ని నిర్ధారించేందుకు గానూ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు జిల్లాలోని వివిధ డివిజన్లలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కురుపాం ఎంఆర్‌సి కేంద్రం వద్ద కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే బుధవారం పార్వతీపురం మండలంలోని నర్సిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్. నర్సిపురం పాఠశాల వద్ద పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, బలిజిపేట, సీతానగరం, మండలాలకు, ఈనెల సాలూరు పట్టణంలోని రామాకాలనీలోని గల మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో సాలూరు, మక్కువ,పాచిపెంట మండలాలకు, ఈనెల 30న పాలకొండ భవితా కేంద్రం ఎంఆర్సి వద్ద పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాలకు చెందిన వికలాంగ విద్యార్థులు పరీక్షలు జరుగుతాయన్నారు. కావున ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వైకల్య నిర్ధారణ జరిగిన తర్వాత వారికి తగ్గ ఉపకరణాలు అందజేయబడతాయని, కావున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే క్యాంపునకు హాజరైన పిల్లలకు, తల్లిదండ్రులకు ఉచిత భోజనం, రవాణా ఖర్చులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

బాలుడి హత్య కేసులో
నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంతకవిటి మండలం కొండగూడెం గ్రామంలో రెడ్డి దుర్గాప్రసాద్ (13) హత్య కేసులో ప్రధాన నిందితుడు కొండపల్లి గోవిందరావుకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం మూడో ఎడిజె ఫ్యామిలీ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఈ మేరకు రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

రెడ్డి సూరపునాయుడు కుటుంబం రేగిడి మండలం లింగాలవలస నుండి సంతకవిటి మండలం కొండగూడెం వలస వచ్చి, బాగా స్థిరపడింది. దీంతో వారికి, కొండపల్లి గోవిందరావు కుటుంబాల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. అవకాశం కోసం వేచి ఉన్న కొండపల్లి గోవిందరావు... 8వ తరగతి చదువుతున్న రెడ్డి సూరపునాయుడు కుమారుడు దుర్గా ప్రసాద్‌ను 2021 మే ఒకటో తేదిన రాత్రి 8 గంటల సమయంలో ఆ గ్రామంలో ఇతర కుటుంబ సభ్యులు/నిందితులు అయిన కొండపల్లి సింహాచలం (ఎ2), కొండపల్లి శంకరరావు (ఎ3), కొండపల్లి లక్ష్మి నారాయణ (ఎ4), కొండపల్లి అన్నపూర్ణ (ఎ5) సహకారంతో హత్య చేశాడు. విషయం తెలుసుకున్న అప్పటి సంతకవిటి ఎస్ఐ సిహెచ్.రామారావు కేసు నమోదు చేశారు. అప్పటి రాజాం సిఐ ప్రస్తుతం పాడేరులో పని చేస్తున్న డి.నవీన్ కుమార్ దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించి, నిందితులపై కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం నుండి ప్రస్తుత రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో సాక్ష్యులకు ఎప్పటికప్పుడు బ్రీఫ్ చేయడం, కోర్టు హెచ్‌సి ఇ.తారకేశ్వరరావు సకాలంలో సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ పోలీసు వారి తరుపున వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడు కొండపల్లి గోవిందరావుపై నేరం రుజువు కావడంతో 3వ ఎడిజె ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి టి.భాస్కరరావు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించారు.

షాపు అద్దె గోల్‌మాల్‌పై చర్యలేవీ?

- విచారణ నిర్వహణకు నిరాకరించిన ఎఇ
- తొక్కి పెట్టేందుకు ప్రయత్నాలు
- మరొకరితో నిర్వహిస్తామంటున్న అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపు అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. నెలరోజులు దాటినా దీనిపై ఎలాంటి పురోగతి లేదు. గత మున్సిపల్ సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తితో సహా కొంతమంది కౌన్సిలర్లు షాపు అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ ప్రసన్న వాణి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఇంతవరకు ఎలాంటి విచారణ జరగలేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపు అద్దె గోల్‌మాల్‌పై విచారణ జరపాలని కోరుతూ మున్సిపల్ ఎఇ సూరినాయుడుకు కమిషనర్ అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే తనకు సంబంధం లేని వ్యవహారంపై విచారణ జరపలేనని ఎఇ సూరి నాయుడు తిరస్కరించారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరో అధికారితో విచారణ జరిపించే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేసి వ్యవహారాన్ని తొక్కిపెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలలో మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ జర్జాపు దీప్తి సహా కొంతమంది కౌన్సిలర్లు షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపును పరిశీలించారు. ఆ షాపు ఖాళీగా ఉందని అధికారులు చెప్పడంతో అనుమానం వచ్చిన కౌన్సిలర్లు, వైస్ చైర్‌పర్సన్‌తో కలిసి షాపును రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిశీలించారు. ఆ షాపు ఖాళీగా లేదని, పట్టణానికి చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో ఉందని నిర్ధారణ అయింది. 2017 నుంచి ఆ షాపు తన అధీనంలో ఉందని, అద్దె చెల్లించలేదని ఛార్టర్డ్ అకౌంటెంట్ అధికారులకు ఫోన్‌లో చెప్పారు. సుమారు రూ.3.5 లక్షల అద్దె డబ్బులు రావాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ షాపును అనధికారికంగా ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో వుంచుకుంటూ అద్దె డబ్బులు మాత్రం ముఖ్య పట్టణ నేతకు చెల్లించారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై విచారణ ముందుకు జరగడం లేదు. అధికార పార్టీ ముఖ్యనేత ప్రమేయం ఉండడంతో అధికారులెవరూ విచారణ నిర్వహణకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. విచారణ పేరుతో కాలయాపన చేసి వ్యవహారాన్ని తొక్కి పెట్టే ప్రయత్నంలో మున్సిపల్ అధికారులు ఉన్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఖజానాకు చెల్లించాల్సిన షాపు అద్దె సొమ్మును తన సొంత ఖాతాలో జమ చేసుకున్న నేత ఎవరో అధికారులకు తెలుసు. తెలిసీ ఇంత కాలం మౌనంగా వుండడం కూడా సంబంధిత శాఖ అధికారుల తప్పిదమేనన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. దీనిపై మున్సిపల్ ఆర్వో రాఘవా చార్యులును ప్రశ్నించగా మున్సిపల్ ఎఇ సూరినాయుడుచే విచారణ జరిపించాలని ఉత్తర్వులు చేసినట్లు తెలిపారు. అయితే ఆయన విచారణ నిర్వహణకు నిరాకరించిన కారణంగా మరొరితో జరిపిస్తామని చెప్పారు.



వివాదంలో ఉన్న షాపు

ఊరికి దూరం... పనులకు భారం

అటువైపు చూడని లబ్ధిదారులు
ముందుకు సాగని జగనన్న ఇళ్ల పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అంత వరకు బాగా ఉంది. అయితే ఇచ్చిన ఇళ్ల స్థలాలు జనజీవనానికి ఆమడదూరాన ఉండడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇందుకు ఉదారణ వీరఘట్టం మండల కేంద్రంలో నిలిచిన జగనన్న ఇళ్లే.

మండలంలోని వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధి ఆచెప్పవలస గిరిజన గ్రామానికి సమీపంలో 2020 డిసెంబర్ 28న వీరఘట్టంకి చెందిన సుమారు 325 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గృహ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్ పథకం కింద రూ.1.80లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. అయితే ఈ స్థలం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులెవరూ ముందుకు రావడంలేదు. దీంతో అక్కడ ఇచ్చిన ఇళ్ల స్థలాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు కొండలకు సమీపాన ఉన్నందున గృహాలు నిర్మించుకొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీనితోడు ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదు. పోనీ కాస్త పనులు చేపడుద్దామన్నా రోజుకు రూ.800 మేస్త్రీకి కూలి ఇవ్వాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన నిధులు కూలీలకే సరిపోతుందని, ఇక ఇళ్లను ఎలా కట్టుకుంటామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి అయిన ఇసుక, సిమెంటు, ఇటుక, మేస్త్రి కూలీలు అధికంగా ఉండడంతో పాటు గ్రామానికి దూరంగా ఉన్నాయని, అలాగే ఇళ్లు నిర్మించుకొనేందుకు అక్కడ ఎటువంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో నిర్మాణదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలు ఇచ్చినట్టుగా ఉన్నాయి తప్ప ఇక్కడ ఒక్క ఇటుక పడలేదు.

భూము కొనుగోలులో నాయకులు చేతివాటం

ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ప్రాంతంలో అప్పట్లో ప్రభుత్వం దళితుల జీవన ప్రమాణాలు మెరుగుకు కొనుగోలు చేసి ఇచ్చిన భూములు ఇళ్ల స్థలాల పేరుతో పాలకులు, అధికారులు ఏకమై ఎందుకు పనికిరాని భూములను లక్షల్లో కొనుగోలు చేసి సుమారు 325 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. భూమి కొనుగోలులో ప్రభుత్వం కళ్లుగప్పి పాలకులు, అధికారులు ఏకమై లక్షల్లో చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పక్కా గృహాలు ఉన్న వారికి స్థలాలు పంపిణీ చేయడం వల్ల నిజమైన లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టక ఖాళీగా ఉన్న స్థలాలు

టిడిపి నాయకుల మాటలు నమ్మొద్దు : రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పే మాయమాట నమ్మి మోసపోవద్దని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలసలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా ఎమ్మెల్సీగా పని చేసిన సంధ్యారాణి గిరిజనుల కష్టాలు తెలుసుకోవడానికి, వారి సమస్యల పరిష్కారానికి ఒక్క రోజైనా కొండలు ఎక్కి గిరిశిఖర గ్రామాల్ని సందర్శించారా అని ప్రశ్నించారు. ఓట్లు, పదవి కోసం ఇప్పుడు గిరిజన గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. తాను ఏ పదవీ లేనప్పుడు ఉద్యోగం చేసిన సమయంలో ఈ గిరిజన గ్రామాల్లో ఎన్నో రాత్రులు ఉన్నానని, పదవి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్ని ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. గడిచిన ఐదేళ్లలో గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అందించామన్నారు. అలాగే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. కావున తనను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు. అంతకుముందు గ్రామంలో గ్రామ దేవత అయిన పారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, జడ్పీ వైస్‌చైర్మన్ కె.సింహాచలం, వైసిపి నాయకులు పి.వీరమనాయుడు, టి.గౌరీశ్వరరావు, మీసాల చంటి, వైస్ ఎంపిపి రవీంద్ర, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాయిగుడ్డిలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

మరింత మెరుగ్గా పేదలకు సంక్షేమ పథకాలు

పార్వతీపురం రూరల్ : వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తే మరింత మెరుగ్గా సంక్షేమ పథకాలు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. పట్టణంలోని 7,1 వ వార్డుల్లో గల జగన్నాధపురం, కొత్తవలసలో పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా ప్రజలకు అందేలా పథకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్లు చిన్నంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ట్రైబల్ వెల్ఫేర్ సహకార సొసైటీ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వాలు వీరి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి ఆదుకోవాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పి.కోనవలస ఆశ్రమ పాఠశాలలను సోమవారం సందర్శించిన ఈశ్వరరావు సిబ్బంది ప్రకాశరావు, సింగారపు విజయ్, నరసింహులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30 నుంచి 40 ఏళ్లుగా సేవలందిస్తున్న ఈ ఉద్యోగులను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగం అభివృద్ధి జరగాలంటే ముందుగా ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 560మందికి పైగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా వీరి గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వీరిని రెగ్యులరైజ్ చేసేలా కృషి చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఈశ్వరరావు

ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వి.త్రినాథరావునాయుడు, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్ఐ లోవరాజు హెచ్చరించారు. మండలంలోని పారాది, పెంట, పారాది, అలజంగి వేగావతి నదిలో ఇసుక నిల్వలను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకతో మొదటిసారి పట్టుబడితే రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు, మూడోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒలు పాల్గొన్నారు.

టిడిపిలో మాజీ సర్పంచుల చేరిక

ప్రజాశక్తి- రేగిడి/రాజాం

రాజాం మండలం శ్యాంపురం టిడిపి క్యాంప్ కార్యాలయంలో రేగిడి మండలం సోమరాజు పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు బూడు పైడితల్లి, సత్యంనాయుడుతో పాటు టిడిపి అనుచ‌రులు, పలు కుటుంబాలు సోమవారం మాజీమంత్రి, రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, మాజీ జెడ్‌పిటిసి ఎం. ఉషారాణి, నాయకులు గేదెల బాలమురళి, పాలూరి రామినా యుడు, బూడు ఆదినారాయణ, శాసపు గోవింద నాయుడు, చల్ల భుజంగరావు, తునివాడ ధనుంజయ్, పైల వినయ్, అంబల్ల సత్యంనాయుడు, సన్నిబాబు, బాలి రామినాయుడు, పాల్గొన్నారు.

బొబ్బిలి: తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన 20 యాదవ కుటుంబాలు, అలజంగి గ్రామానికి చెందిన 30 దళిత కుటుంబాలు సోమ వారం వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. కోటలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ఆధ్వర్యంలో టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఎన్నికల నియమావళిపై డేగకన్ను


- వైసిపి ఎమ్మెల్యే శంబంగిపై కేసు నమోదు
- ఎస్.కోట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్
- రామభద్రపురం పోలీసులకు సిఐ పలు సూచనలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల నియమావళిపై ఎన్నికల అధికారులు డేగకన్ను వేశారు. నియమావళి పర్యవేక్షణకు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేయగా, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలు, జెండాలు, గోడ పత్రికలను తొలగించారు. ఎన్నికల నియమావళిను ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా నిమ్మలపాడు, ఇతర గిరిజన గ్రామాల్లో ప్రచారం చేసిన వైసిపి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుపై ఎంసిసి నోడల్ అధికారి రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు

నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిను పటిష్టంగా అమలు చేసేందుకు, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలు, నాయకులపై చర్యలు తీసుకునేందుకు ఎన్నికల కమిషన్ పటిష్ట చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములను ఏర్పాటు చేశారు. తొమ్మిది టీములు షిఫ్ట్‌కు మూడు టీములు చొప్పున 24గంటలు ఎన్నికల నియమావళిను పర్యవేక్షణ చేస్తారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, ఇతర సామగ్రిని తరలించకుండా నివారించేందుకు మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం, సభలు, ర్యాలీలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనను పరిశీలించేందుకు ఒక వీడియో సర్వే లైన్స్ టీమ్, వీడియో వ్యూయింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకునేందుకు మున్సిపాలిటీలో కమిషనర్‌ను ఎంసిసి నోడల్ అధికారిగా నియమించగా బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో కోడ్ ఉల్లంఘనను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకునేందుకు ఎంపిడిఒలను ఎంసిసి నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులను స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 08944-255888కు ఫిర్యాదు చేయవచ్చును.


బొబ్బిలి: మీడియా కథనాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న సిబ్బంది

ఎన్నికల నియమావళి నిరంతర పర్యవేక్షణ


ఎన్నికల నియమావళిను పర్యవేక్షణ చేసేందుకు ఆర్‌డిఒ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయగా సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న కథనాలను ఉల్లంఘించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌ఒ ఎ.సాయిశ్రీ అన్నారు. ఎన్నికల కోడ్ ఎక్కడ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిను పాటించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని బర్మా కాలని, శ్రీనివాస కాలని, రైల్వే కాలనిలలోని పోలింగ్ స్టేషన్లను సోమవారం తహశీల్దార్ కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు సక్రమంగా ఉండే విధంగా చూడాలని, పోలింగ్ సమయంలో ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి భరత్ కుమార్, విఆర్‌ఒ కన్నయ్య, విఆర్‌ఎ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: పోలీసులకు సూచనలు చేస్తున్న సిఐ తిరుమలరావు

రామభద్రపురం: పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు పక్కాగా అమలు చేయాలని సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సహకరించాలని సూచించారు. ప్రతీ పౌరుడు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా, నిషేధిత గుట్కా విక్రయాలపై నిఘా ముమ్మరం చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఇందిర

స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ


సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్లకు కనీసవేతన రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. కొమరాడలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లతో విస్తృత సమావేశం ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఆర్.రాజేశ్వరి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఇందిర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా అరకొర జీతాలిచ్చి పనులు చేయించుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అపాలని, పనిభద్రత కలింపచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ స్కీం వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, టిఎ, డిఎ ఇవ్వాలని, ఉపాధి పనులు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, యూనిఫార్మ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు సిరికి అనురాధ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వం పైన తెలిపిన స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించేలా ఆలోచించాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, మధ్యాహ్నం భోజనం కార్మికులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలకు సూచనలు చేస్తున్న ఎంపిడిఒ సుబ్రమణ్యం

బొమ్మలు కనిపిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఫొటోలు కనిపిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం అంగన్వాడీ కార్యకర్తలకు హెచ్చరించారు. మండలంలోని చిట్టిపూడివలస అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. పిల్లలకు ఇచ్చే పాలు ప్యాకెట్లు, చెక్కీలు తదితరమైన వాటిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బొమ్మపై తెల్లకాగితం అంటించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆ పరిశీలనలో ఇఒపిఆర్‌డి టివిఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


ఎంఆర్ నగరంలో ప్రచారం చేస్తున్న విజయచంద్ర

టిడిపి అధికారంలోకి వస్తే రూ.4వేలు పింఛను

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాబోయే ఎన్నికల్లో టిడిపికి మద్దతిచ్చి అధికారంలోకి తీసుకువస్తే సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా పేదలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామని పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని ఎంఆర్ నగరంలో సోమవారం తెలుగుదేశం, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుతో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడమే కాకుండా లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంటి, జనసేన నాయకులు ఆగురు మని, బిజెపి నాయకులు పారిశెరల అప్పారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

ఎన్నికల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ ఎన్నికల నిర్వహణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు, పోలింగ్, పోలింగ్ బూత్, ఎన్నికల సంఘం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమైంది, నిర్వహణ, విధానాలపై అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దాన్ని సద్వినియోగం చేసుకొనేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటును రూ.500కో, రూ.వెయ్యికో అమ్ముకోకుండా విద్యావంతులు మేధావులను ఎన్నుకొనేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈదులవలసలో ఎత్తయిన పుట్ట

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని నాగావళి నది ఆవల ఉన్న వన్నాం పంచాయతీ ఈదులవలస గ్రామంలో ఎత్తైన పుట్ట పలువుర్ని ఆకర్షిస్తుంది. ఆ గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి రాంబాబు పామ్ ఆయిల్ తోటలో ఉన్న ఈ పుట్ట మనిషి కన్నా చెట్టుతో సమానంగా ఉంది. ప్రతి ఏటా ఆ పంట పొలంలో పది వరకు పుట్టలు ఆరు అడుగుల ఎత్తుతో ఉంటుందని, ఈసారి మాత్రం ఈ పుట్ట పామాయిల్ చెట్టుతో సమానంగా పెరిగిందని రైతులు తెలిపారు.


పామాయిల్ తోటలో ఎత్తయిన పుట్ట

ధాన్యం డబ్బులు తక్షణమే చెల్లించాలి

రైతుల డిమాండ్

ప్రజాశక్తి - వీరఘట్టం

తమకు తక్షణమే ధాన్యం డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని మండలానికి చెందిన పలువురు అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరుల వద్ద పలువురు రైతులు తమ ఆవేదనను వెలబుచ్చారు. ధాన్యం డబ్బులు రాకపోవడంతో వ్యవసాయ మదుపులకు చేసిన అప్పులు చెల్లించలేక వడ్డీల మీద వడ్డీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 14న వీరఘట్టం మండలంలోని కిమ్మి వద్ద వంతెన ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతులు మొరపెట్టుకున్నారు. దీంతో మూడు రోజుల్లో మీ ఖాతాలోకి డబ్బులు పడతాయని హామీ ఇచ్చారన్నారు. అయితే మంత్రి హామీ ఇచ్చి నేటికి 12 రోజులు కావవస్తున్నా తమ అకౌంట్లలో డబ్బులు పడలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని 1005 మంది రైతులకు సంబంధించి సుమారు రూ.9.5 కోట్లు ధాన్యం డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వాటా ఇవ్వలేదని ఎస్‌పికి ఫిర్యాదు

వెంకటేశ్వరా డీలక్స్ స్థలంపై యువరాజు కుమార్తె

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలానికి సంబంధించిన అమ్మకంలో తనకు రావాల్సిన వాటా సొమ్ము ఇవ్వలేదని పి.విజయలక్ష్మి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన తండ్రి విక్రమ చంద్ర సన్యాసి రాజు ఆ స్థలం కొనుగోలు దారులు కుమ్మక్కై తన వాటా సొమ్ము ఇవ్వలేదని పేర్కొంటూ ఆమె ఫిర్యాదు చేశారు. తండ్రి సన్యాసి రాజు, కొనుగోలుదారులు తనను మోసగించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన తాత ముత్తాతల ఆస్తిలో చట్టబద్ధంగా రావాల్సిన వాటా సొమ్ము ఇవ్వలేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- బొబ్బిలి

వ్యవసాయ బావిలో దూకి వాలంటీర్ అలబోను వెంకట సాయి రామకృష్ణ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లోవరాజు వివరాలు మేరకు.. మున్సిపాలిటీలోని బంగారమ్మకాలనీకు చెందిన అలబోను వెంకట సాయి రామకృష్ణ 7వ సచివాలయంలో వార్డు వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి శనివారం రామకృష్ణ శ్రీకాకుళంలో ఉన్న ఇస్కాన్ ఆలయానికి వెళ్లి ఆదివారం రాత్రికి ఇంటికి వస్తాడు. శనివారం సాయంత్రం బయటకు వెళ్లిన రామకృష్ణ ఇస్కాన్ ఆలయానికి వెళ్లాడనుకున్న కుటుంబ సభ్యులకు సోమవారం మధ్యాహ్నం మరణవార్త అందడంతో బోరున విలపిస్తున్నారు. పాతషుగర్ ఫ్యాక్టరీ-అప్పయ్యపేట రోడ్డులో ఉన్న వ్యవసాయ బావిలో అతని మృతదేహం లభ్యమైంది. బావి సమీపంలో మూడు రోజులుగా ద్విచక్ర వాహనం ఉండటాన్ని గమనించిన రైతులు బావిలో చూడగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు మృతుని జేబులో ఉన్న సమాచారం ఆధారంగా వాలంటీర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శనివారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'గెలిపిస్తే అభివృద్ధి చేస్తా'

ప్రజాశక్తి- బొబ్బిలి

తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇంఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబర్కి శరత్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ: తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తానని గజపతినగరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జగ్గాపురం, గొర్లి పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.